
ట్రోఫీని ఆవిష్కరిస్తున్న డీజీపీ జితేందర్

24 నుంచి టీడీసీఏ అండర్-17 క్రికెట్ టోర్నీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఈనెల 24 నుంచి తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘం (టీడీసీఏ) అండర్-17 వన్డే టోర్నమెంట్‌ను నిర్వహిస్తోంది. అమెరికా యూత్ క్రికెట్ జట్టుతో టీడీసీఏ రూరల్ వారియర్స్, రైజర్స్, పాంథర్స్ టీమ్‌లు తలపడనున్నాయి. టోర్నీమెంట్‌లో పాల్గొంటున్న జట్ల జెర్సీలను డీజీపీ జితేందర్ తన కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. గ్రామీణ తెలంగాణ క్రికెటర్ల అభ్యున్నతి కోసం టీడీసీఏ చేస్తున్న కృషిని జితేందర్ అభినందించారు. టీడీసీఏ అధ్యక్షుడు అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి, అమెరికా యూత్ క్రికెట్ అకాడమీ అధ్యక్షుడు అరుణ్, ఎస్‌జీఏఫ్ చైర్మన్, రామిరెడ్డి, టీడీసీఏ సభ్యులు ఉస్మాన్ అలీ, సయ్యద్ నవాజ్ షా, సుధీర్ రెడ్డి పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

గర్భాశయ క్యాన్సర్‌పై మహిళలకు అవగాహన

హైదరాబాద్ సిటీ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): లండన్‌లో ప్రవాస భారతీయులు స్థాపించిన బెర్క్‌షైర్ భారత్ కమ్యూనిటీ (బీబీసీ) చారిటబుల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మహిళల గర్భాశయ క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాన్ని గురువారం లండన్‌లోని స్లవ్‌లో నిర్వహించారు. మహిళల్లో వచ్చే సర్వైకల్ కాన్సర్‌పై అవగాహన కల్పించామని ఆర్గనైజేషన్ కార్యనిర్వాహక సభ్యురాలు అనిత అవుల తెలిపారు. గర్భాశయ క్యాన్సర్ ఇప్పటికీ ప్రపంచ ఆరోగ్య సమస్యగా ఉందని, టీకాలు వేయడం, స్క్రీనింగ్, ముందస్తు చికిత్సతో నివారించవచ్చన్నారు. ప్రభుత్వాలు, ఆరోగ్య సంరక్షణ, స్వచ్ఛంద సంస్థలు క్యాన్సర్ నివారణకు కలిసి పనిచేయాలన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు లీలా అంజిరెడ్డి, సుచిత్ర నోముల, పలువురు మహిళలు పాల్గొన్నారు.


పైపులైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్, కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్

వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు

● ఎమ్మెల్యే దానం నాగేందర్

బంజారాహిల్స్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. జూబ్లీహిల్స్ డివిజన్ ఇందిరానగర్‌లో రూ. 67 లక్షలతో చేపట్టనున్న పైపులైన్ పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖైరతాబాద్ నియోజకవర్గంలో తాగునీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలను గుర్తించి పైపులైన్ పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు పూర్తయ్యాయని, నిధులు మంజూరయ్యాయని చెప్పారు. దశలవారీగా అన్నిచోట్ల పనులు ప్రారంభిస్తామన్నారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందన్నారు. కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ మాట్లాడుతూ 20 సంవత్సరాలుగా ఇందిరానగర్ వాసులు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారని, పైపులైన్ పనులు త్వరగా పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు మామిడి నర్సింగరావు, వాటర్‌వర్క్స్ జీఎం హరిశంకర్, మేనేజర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటుకు

స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలి

పంజాగుట్ట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలంలో బాటసారుల దాహార్తిని తీర్చడానికి రహదారుల పక్కన చలివేంద్రాలను ఏర్పాటు చేయడానికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప అన్నారు. మంచుకొండ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పంజాగుట్ట ప్రధాన రహదారిలో నిమ్స్ ఆస్పత్రి వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఫౌండేషన్ చైర్మన్ మంచుకొండ ప్రకాశంతో కలిసి గురువారం ప్రారంభించారు. ప్రకాశం మాట్లాడుతూ నిమ్స్‌కు వచ్చే రోగులు, వారి సహాయకులు, రహదారిపై ప్రయాణించే వారి దాహార్తిని తీర్చడమే లక్ష్యంగా చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. కార్యక్రమంలో ఫౌండేషన్ డైరెక్టర్లు రవికుమార్, సురేందర్, వరుణ్‌కుమార్, అరుణ్ కుమార్, కో-ఆర్డినేటర్లు శ్రవణ్, ఆదినారాయణ, మల్లేష్ పాల్గొన్నారు.


సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కార్పొరేటర్ సీఎన్ రెడ్డి

సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

బోరబండ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): బడ్జెట్‌లో నగరానికి అధిక నిధులు కేటాయించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి రహ్మత్‌నగర్ కూడలి, శ్రీరామ్‌నగర్ కూడలి, ఎస్పీఆర్ హిల్స్ ఇందిరాగాంధీ విగ్రహం వద్ద కార్పొరేటర్, జీహెచ్ఎంసీ స్థాయీ సంఘం సభ్యుడు సి.ఎన్.రెడ్డి కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్‌లో జీహెచ్ఎంసీకి రూ. 3,101.21 కోట్లు కేటాయించడం పట్ల హర్షం వ్యక్తంచేశారు.

● బోరబండ బస్టాపు వద్ద ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి కార్పొరేటర్ సతీమణి, నగర కాంగ్రెస్ నాయకురాలు హబీబా సుల్తానా కార్యకర్తలతో కలిసి క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ బోరబండ డివిజన్ అధ్యక్షుడు బండారి అశోక్, బస్తీ అధ్యక్షుడు ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాటర్‌బోర్డులో ముగ్గురికి కారుణ్య నియామకం

హైదరాబాద్ సిటీ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కారుణ్య నియామకం కింద ముగ్గురికి ఉద్యోగ అవకాశాలను వాటర్‌బోర్డు కల్పించింది. బోర్డులో విధులు నిర్వహిస్తూ మరణించిన ముగ్గురి ఉద్యోగుల వారసులకు.. వారి వారి విద్యార్హతల ఆధారంగా కారుణ్య నియామకం కింద ఉపాధి కల్పించారు. ఇందుకు సంబంధించిన నియామక పత్రాలను గురువారం ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో ఈడీ మయాంక్ మిట్టల్ వారికి అందజేశారు. కార్యక్రమంలో సీజీఎం మహమ్మద్ అబ్దుల్ ఖాదర్ పాల్గొన్నారు.

ఖైరతాబాద్‌లో రోడ్లు అధ్వానం

● పైపులైన్ పనులు పూర్తయినా మరమ్మతులు చేయని వైనం
● ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు
● ప్రజలు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు


న్యూసీబీఐ క్వార్టర్స్‌లో రహదారి దుస్థితి

ఖైరతాబాద్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ అధికారుల అలసత్వం, ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగా ఖైరతాబాద్‌లోని పలు రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్ల విషయమై అధికారులు, ప్రజా ప్రతినిధులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఖైరతాబాద్ పాఠ్యపుస్తక ముద్రణాలయం గుండా మింట్ కాంపౌండ్ రహదారి చౌరస్తా వరకు ఓల్డ్ సీబీఐ క్వార్టర్స్ వర్షపునీటి ముంపు సమస్య పరిష్కారం కోసం ఇటీవల బాక్స్ డ్రైన్ పనులు జరిగాయి. దాదాపు నెలన్నర రోజులు రహదారిని మూసి వేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పనులు పూర్తయినా సీసీ రోడ్డు వేయడం గానీ, మరమ్మతులుగానీ చేయలేదు. సగభాగం మాత్రమే రోడ్డు వేశారు. రోడ్డు అధ్వానంగా ఉండడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. న్యూ సీబీఐ క్వార్టర్స్ మాస్టర్ టాలెంట్ స్కూల్ లేన్‌లో డ్రైనేజీ, తాగునీటి పైపులైన్లు వేశారు. పనులు పూర్తయినా రోడ్డు వేయడం లేదు. నిధులు లేక రోడ్డు పనులు చేపట్టడం లేదని అధికారులు చెబుతుండడం విశేషం. రోడ్డుకు ప్యాచ్‌వర్క్ చేయాలని కాంట్రాక్టర్, జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులు దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. న్యూ సీబీఐ క్వార్టర్స్ దుర్గాభవానీ దేవాలయంతో పాటు దాని పక్క వీధిలో సివరేజీ పైప్‌లైన్లు వేసినా, రోడ్డు పనులు ఇంకా చేపట్టకపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్యాచ్ వర్క్ పనులు చేయకపోయినా బిల్లులు చెల్లిస్తుండడంతో అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కయినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.


అధ్వానంగా ఉన్న ప్రభుత్వ ముద్రణాలయం ఎదురు రోడ్డు

ఎమ్మెల్యే లేఖ రాసినా..

ఖైరతాబాద్‌లోని పలు వీధుల్లో సీసీ రోడ్లు వేయాలని ఎమ్మెల్యే లేఖ రాసి దాదాపు ఆరు నెలలు అయినా కలెక్టరేట్ నుంచి నిధులు మంజూరు కాలేదు. గుంతలమయమైన రోడ్లకు మరమ్మతులు చేయడానికి జోనల్ కమిషనర్ చర్యలు తీసుకోవాలని ఖైరతాబాద్ వాసులు కోరుతున్నారు.

రోడ్లకు మరమ్మతులు చేయాలి



బడాగణేష్ నుంచి మింట్ కాంపౌండ్ రోడ్డు, న్యూసీబీఐ క్వార్టర్స్‌లోని మూడు వీధులు, గ్రంథాలయం వెనకవైపు నుంచి పాత కల్లు కాంపౌండ్ రహదారి అధ్వానంగా ఉన్నాయి. ప్రతీరోజూ ఇద్దరు, ముగ్గురు వాహనదారులు గాయపడుతున్నారు. రోడ్లకు మరమ్మతులు చేయాలి.

- శ్రీనివాస్ యాదవ్, న్యూ సీబీఐ క్వార్టర్స్, ఖైరతాబాద్

త్వరలో రోడ్ల పనులు ప్రారంభిస్తాం



గ్రంథాలయం వెనుక రోడ్డుతోపాటు మాస్టర్ టాలెంట్ పాఠశాల వీధిలో రోడ్డు పనులను త్వరలో ప్రారంభిస్తాం. టెండర్లు పిలిచాం. దుర్గాభవానీ దేవాలయం, పక్క వీధిలో రోడ్లకు మరమ్మతులు చేశాం. ప్రభుత్వ ముద్రణాలయం వద్ద సగం రోడ్డు వేశాం. మిగతా పనులు త్వరలో పూర్తి చేస్తాం. కాంట్రాక్టర్ మధ్యలో పనులను ఆపేయడంతో ఆలస్యమైంది.

- కృష్ణ చైతన్య, డీఈఈ, ఖైరతాబాద్ సర్కిల్, జీహెచ్ఎంసీ

మాదిగలకు నష్టం కలిగించే పనిచేయొద్దు

● మందకృష్ణకు ఉద్యమకారుల సూచన
● కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలలో వర్గీకరణ అమలు చేయాలి


అభివాదం చేస్తున్న ఎమ్మార్పీఎస్ ఉద్యమకారులు

పంజాగుట్ట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో వర్గీకరణ చట్టం చేసినా మందకృష్ణ మాదిగ నిందలు వేస్తున్నారని ఎమ్మార్పీఎస్ ఉద్యమకారులు ఆరోపించారు. మాదిగలకు నష్టం కలిగించే పనిని చేయవద్దని ఆయనకు సూచించారు. ఏపీలో వర్గీకరణ చేయని చంద్రబాబు నాయుడును పొగుడుతూ తెలంగాణలో వర్గీకరణ చట్టం తెచ్చిన రేవంత్ రెడ్డిని దుర్భాషలాడుతున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలలో వర్గీకరణ అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.

గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి దేవని సతీష్, ఉద్యమకారులు పాలడుగు శ్రీనివాస్, అల్లారం రత్నయ్య, కొక్కెర భూమన్న, జన్ను జయరాజ్, టీఎండీ రాష్ట్ర అధ్యక్షుడు దైద శ్యామ్ తదితరులు మాట్లాడారు. వర్గీకరణ క్రెడిట్ తన, బీజేపీ ఖాతాలో పడడం లేదనే ఆవేదనలో మందకృష్ణ ఉన్నారన్నారు. వర్గీకరణకు మద్దతుగా కేంద్ర ప్రభుత్వం సుప్రీం కోర్టుకు అఫిడవిట్ ఇచ్చిందని ఆయన అంటున్నారని, దానిని బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. పదేళ్ల నుంచి కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఉషా మెహరా కమిషన్ నివేదిక గురించి ఎందుకు పట్టించు కోలేదన్నారు. దిగజారుడు మాటలు మాట్లాడవద్దని మందకృష్ణకు వారు హితవు పలికారు. 18 శాతం రిజర్వేషన్ల కోసం పోరాడదామన్నారు. మాదిగ విద్యార్థులు మందకృష్ణ మాటలు నమ్మొద్దన్నారు. త్వరలో పరేడ్ గ్రౌండ్‌లో 20 లక్షల మందితో విజయోత్సవ సభ నిర్వహిస్తామని, రాహుల్ గాంధీని ఆహ్వానిస్తామని, సీఎం రేవంత్‌రెడ్డిని సన్మానిస్తామని చెప్పారు. ఉద్యమకారులు బారికే రావు, శ్రీనివాస్, పెద్దన్న, టి.నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

వివాహం చేసుకుంటానని మోసం

● పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని బాధితురాలి ఆరోపణ
● న్యాయం చేయాలని సీఎం, డీజీపీకి వినతి

పంజాగుట్ట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): వివాహం చేసుకుంటానని మోసం చేసిన ఓ వ్యక్తిపై ఫిర్యాదు చేసినా పోలీసులు చర్యలు తీసుకోవడం లేదని ఓ మహిళ ఆరోపించింది. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో బాధితురాలు తన గోడు వెళ్లబోసుకున్నారు. మహారాష్ట్రకు చెందిన ఆమె 2009లో నగరానికి వచ్చింది. పలు సంస్థల్లో సేల్స్ విభాగంలో పనిచేసింది. 2023లో ఫ్రెండ్ ద్వారా గాంధీనగర్‌కు చెందిన నితిన్‌కుమార్ కామినేనితో పరిచయం ఏర్పడిందని తెలిపింది. తనకు అమెరికా వెళ్లాలనే కోరిక ఉండేదని, నితిన్ అమెరికా తీసుకెళ్తానని నమ్మించడంతో ఇద్దరం కలిసి ఉంటున్నామని చెప్పింది. కొద్ది రోజుల తర్వాత అతడికి వివాహం అయిందని, ఇద్దరు పిల్లలు ఉన్నారని తెలియడంతో నిజం ఎందుకు చెప్పలేదని నిలదీశానని, భార్యను ఒప్పించి తనను పెళ్లి చేసుకుంటానని చెప్పాడని బాధితురాలి తెలిపింది. తాను కష్టపడి సంపాదించిన డబ్బులో రెండేళ్ల నుంచి పలు దఫాలుగా రూ. 10 లక్షలు తీసుకున్నాడని, పెళ్లి ఎప్పుడు చేసుకుంటావు, అమెరికా ఎప్పుడు తీసుకెళ్తావని అడిగిన ప్రతిసారీ అబద్ధాలు చెప్పి తప్పించుకునేవాడని, రెండుసార్లు గర్భవతిని చేసి అబార్షన్ చేయించాడని ఆమె తన బాధ వెళ్లబోసుకుంది. గట్టిగా నిలదీస్తే క్యారెక్టర్ లేదని అవమానిస్తూ దాడిచేసేవాడని ఆరోపించింది. ఈనెల 7వ తేదీన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని తెలిపింది. న్యాయం చేయాలని రోజూ పోలీస్‌స్టేషన్‌కు వెళ్తున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేసింది. న్యాయం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి, డీజీపీ, సైబరాబాద్ కమిషనర్‌కు బాధితురాలు విజ్ఞప్తి చేసింది.

బీసీల రిజర్వేషన్, వర్గీకరణ బిల్లుల ఆమోదంపై హర్షం


రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న కార్పొరేటర్ వనం సంగీతాశ్రీనివాస్‌యాదవ్ తదితరులు

బంజారాహిల్స్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీతాశ్రీనివాస్ యాదవ్ అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణ బిల్లులను అసెంబ్లీలో ఆమోదించినందుకు హర్షం వ్యక్తం చేశారు. గురువారం అమీర్‌పేటలో రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారని గుర్తుచేశారు. ఫిలింనగర్ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఎస్సీ సెల్ సీనియర్ నాయకుడు కాటూరి రమేష్, నారికెళ్ల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగడ్డ: తెలంగాణ ప్రజలకు రాహుల్ గాంధీ ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం నెరవేర్చిందని కాంగ్రెస్ పార్టీ నగర ప్రధాన కార్యదర్శి దూడల రవి గౌడ్ కొనియాడారు. గురువారం హేమావతి నగర్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ కో-ఆర్డినేటర్ రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బోరబండ: బీసీ, ఎస్సీ వర్గీకరణ బిల్లులు శాసనసభలో ఆమోదం పొందడంపై రహ్మత్‌నగర్ కూడలిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం సంబరాలు జరుపుకున్నారు. పార్టీ నగర ప్రధానకార్యదర్శి, బీసీ నాయకుడు బి.భవానీశంకర్ కార్యకర్తలతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

బేగంపేట: బీసీ రిజర్వేషన్, వర్గీకరణ బిల్లులను అసెంబ్లీలో ఆమోదించడంపై సనత్‌నగర్ నియోజకవర్గంలో గురువారం సంబరాలు నిర్వహించారు. కాంగ్రెస్ ఇన్‌చార్జి డా. కోట నీలిమ పాల్గొన్నారు.

విద్యార్థులకు కళ్లద్దాల పంపిణీ


రాజ్‌భవన్ రోడ్డులోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ వనం సంగీతాయాదవ్

ఇందిరా ఫెలోషిప్



బేగంపేటలోని శ్యామ్‌లాల్ బిల్డింగ్ ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇందిరా ఫెలోషిప్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. సనత్‌నగర్ ఇన్‌చార్జి డా. కోట నీలిమ, ఇందు శ్రీరంగం తదితరులు పాల్గొన్నారు.

- బేగంపేట, ఆంధ్రజ్యోతి

పరుష పదజాలం పరంపరను నిలిపివేయాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు



సమావేశంలో ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ తదితరులు

పంజాగుట్ట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో అలజడులు, అశాంతికి దారితీసే దిశగా సాగుతున్న పరుష పదజాలం పరంపరను వెంటనే నిలిపివేయాలని, ప్రభుత్వ పెద్దలు, మీడియా యాజమాన్యాలు సంయమనం పాటించాలని తెలంగాణ పౌర సమాజం పిలుపునిచ్చింది. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సిగ్నల్ టీవీ సీఈఓ శివారెడ్డి అధ్యక్షతన 'రాష్ట్రంలో పాలన ప్రజాస్పందన-మీడియా తీరు' అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ప్రకాష్ రెడ్డి, పలువురు జర్నలిస్టులు, మేధావులు, రాజకీయ నాయకులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు కాకపోవడంతో అసహనంతో కొంతమంది సీఎం సహా ప్రభుత్వం ప్రతిష్ట దెబ్బతీసే విధంగా మాట్లాడుతున్నారన్నారు. అసెంబ్లీలో కూడా అన్ పార్లమెంటరీ భాషను ఉపయోగిస్తున్నారని, ప్రభుత్వ పెద్దలు సంయమనం పాటించాలని పిలుపునిచ్చారు. మీడియా ఎడిట్ చేసి ప్రసారం చేయాలన్నారు. ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా తరహాలో రాష్ట్రంలో సీనియర్ జర్నలిస్టులతో ప్రెస్‌కౌన్సిల్ ఆఫ్ తెలంగాణను ఏర్పాటు చేయాలన్నారు. సీనియర్ జర్నలిస్టుల ఆధ్వర్యంలో సోషల్ మీడియా, డిజిటల్ మీడియా నియంత్రణకు కమిటీ వేయాలని తీర్మానించారు. జర్నలిస్టుల పై జరుగుతున్న దాడుల విషయంలో ఈ సమావేశంలో వక్తలు వెలిబుచ్చిన అభిప్రాయాలను సీఎం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ తెలిపారు.

ప్రజలు ప్రభుత్వాన్ని తిడుతున్నారు అన్నప్పుడు ప్రభుత్వ పెద్దలు ఆత్మవిమర్శ చేసుకుని సరిదిద్దుకోవాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ప్రకాష్‌రెడ్డి అన్నారు. కేసీఆర్ కుటుంబాన్ని తిట్టించి ఎంజాయ్ చేసింది రేవంత్‌రెడ్డి కాదా అని మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ అన్నారు. రాజకీయ నాయకులు నోరు అదుపులో పెట్టుకోవాలని పలువురు సీనియర్ జర్నలిస్టులు అన్నారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు. జర్నలిస్టులు రేవతి, తన్వియాదవ్ అరెస్టులను, అరెస్టుల విషయంలో పోలీసులు వ్యవహరించిన తీరును సమావేశం ఖండించింది. టీ షాట్ సీఈఓ వేణుగోపాల్ రెడ్డి,పృథ్వీరాజ్ యాదవ్, విఠల్, నర్రా విజయకుమార్‌రెడ్డి, శ్రావణి, శ్రావ్య తదితరులు పాల్గొన్నారు.

'ఎన్నికల జాబితా నిర్వహణలో 'ఏఐ'ను ఉపయోగించాలి'

బేగంపేట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల జాబితా నిర్వహణలో కృత్రిమ మేధ (ఏఐ)ను ఉపయోగించాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు విశాల్ సుధాం అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సాంకేతికంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న భారతదేశంలో 'ఏఐ' టెక్నాలజీని ఉపయోగించడంవల్ల ఎంతో ప్రయోజనముందన్నారు. ఎన్నికల జాబితాలో సమస్యలను పరిష్కరించేందుకు 'ఏఐ' టెక్నాలజీయే ఉత్తమ మార్గమన్నారు. 'ఏఐ' టెక్నాలజీని ఉపయోగించడంవల్ల దొంగ ఓట్లను తొలగించడమే కాకుండా ఓటరు జాబితాలో చిరునామా మార్పు, తప్పులను సవరించే అవకాశాలు ఉన్నాయన్నారు.

భారత ప్రభుత్వం రానున్న రోజుల్లో ఎన్నికల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను ఉపయోగించడం వల్ల మంచి ఫలితాలు సాధించే అవకాశాలు ఉండే అవకాశం ఉందని విశాల్ సుధాం తెలిపారు.

చెత్తను ఆటో రిక్షాలో వేయాలి

ఇళ్లలోని చెత్తను ఆటో రిక్షాలో వేయాలని జీహెచ్ఎంసీ శానిటేషన్ ఉద్యోగులు ఎస్ఎస్ ధన్‌గౌడ్, జవాన్ కృష్ణ అన్నారు. బేగంపేట డివిజన్‌లోని అంబేడ్కర్‌నగర్, భగత్‌సింగ్‌నగర్‌లో పారిశుద్ధ్యంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

సెవెన్ టెంపుల్స్‌లో హుండీ లెక్కింపు

● 50 రోజుల ఆదాయం రూ. 3,81,102

బేగంపేట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్ హనుమాన్ దేవాలయ (సెవెన్ టెంపుల్స్) ప్రాంగణంలోని వివిధ ఆలయాల్లో 20 హుండీల లెక్కింపు కార్యక్రమం గురువారం నిర్వహించారు. 50 రోజుల ఆదాయం రూ.3,81,102 వచ్చింది. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీదేవి, ఈవో సత్యనారాయణ, అర్చకులు రిష్వంజయశర్మ, విజయేంద్ర తదితరులు పాల్గొన్నారు.


హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

రైలులో ప్రయాణికుల ఆభరణాలు చోరీ

బర్కత్‌పుర, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రైలులో ప్రయాణికుల ఆభరణాలను దొంగలు చోరీ చేశారు. దిల్‌సుఖ్‌నగర్‌లో నివసిస్తున్న శ్రీలత(48) తిరుపతి నుంచి కాచిగూడకు వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ రైలులో వస్తోంది. గురువారం తెల్లవారు జామున డోన్ రైల్వే స్టేషన్ సమీపంలో సిగ్నల్ కోసం రైలు ఆగగా ఆమె మెడలో ఉన్న నాలుగు తులాల బంగారు గొలుసును బోగీ కిటికీలో నుంచి దొంగలు లాక్కొని పారిపోయారు.

నంద్యాలకు చెందిన ప్రమీలమ్మ (55) గుంటూరు - కాచిగూడ ఎక్స్‌ప్రెస్ రైలులో వస్తుంది. డోన్ రైల్వే స్టేషన్ సమీపంలో ఆమె మెడలో ఉన్న తులంన్నర బంగారు మంగళ సూత్రాన్ని దొంగ లాక్కొని పారిపోయాడు. బాధితులు కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తదుపరి విచారణ నిమిత్తం కేసులను కర్నూల్ రైల్వే పీఎస్‌కు బదిలీ చేశామని సీఐ ఎల్లప్ప తెలిపారు.

హామీలను ఎప్పుడు అమలు చేస్తారు



కల్యాణలక్ష్మి చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

రాంగోపాల్‌పేట్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఎప్పుడు అమలు చేస్తారని ప్రజలు ఎదురుచూస్తున్నారని మాజీ మంత్రి సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం సికింద్రాబాద్ సర్దార్‌పటేల్ రోడ్డులోని సికింద్రాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో సికింద్రాబాద్, అమీర్‌పేట్ మండలాల పరిధిలోని 69మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల కింద మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. చెక్కుల కోసం వచ్చిన పలువురు లబ్ధిదారులు తులం బంగారం ఎప్పుడిస్తారని అధికారులను ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదని, లేకుంటే ప్రజల నుంచి పెద్ద ఎత్తున వ్యతిరేకత ఎదురవుతోందన్నారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ తహసీల్దార్ ఇస్లావత్ పాండు నాయక్, కార్పొరేటర్లు కుర్మ హేమలత, కొలన్ లక్ష్మీ, మాజీ కార్పొరేటర్లు అత్తిలి మల్లికార్జున్ గౌడ్, నామన శేషు కుమారి, డిప్యూటీ తహసీల్దార్ రంజనీ నాయకులు అత్తిలి శ్రీనివాస్ గౌడ్, కొలన్ బాల్‌రెడ్డి, లక్ష్మీపతి, ఆంజనేయులు, మహేష్ యాదవ్, ప్రేమ్ కుమార్, శేఖర్, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు రేషన్ కార్డులు ఇవ్వాలి



సీఆర్‌ఓకు వినతి పత్రం అందజేస్తున్న వెంకటేష్ తదితరులు

రాంగోపాల్‌పేట్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలకి వెంటనే రేషన్ కార్డులు ఇవ్వాలని సీపీఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ కమిటీ కార్యదర్శి ఎం.వెంకటేష్ డిమాండ్ చేశారు. గురువారం సికింద్రాబాద్ సర్దార్ పటేల్ రోడ్డులోని సీఆర్‌వో కార్యాలయం ఎదుట కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం సీఆర్‌ఓ ఫణీంద్రరెడ్డికి వినతిపత్రం అందజేశారు. పెరుగుతున్న నిత్యావసర ధరల నేపథ్యంలో కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో ఇస్తున్న విధంగా ప్రతి రేషన్ కార్డుపై 14రకాల వస్తువులు ఇవ్వాలని, సన్న బియ్యం ఇస్తామన్న వాగ్దానాన్ని వెంటనే అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సెంట్రల్ జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్, శ్రీనివాస్ రావు, దశరథ్, మహేందర్, రాజన్న, నాగలక్ష్మి, నాయకులు అజయ్‌బాబు, వెంకటేష్, అశోక్ మారన్న, పి.మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీ ఆస్పత్రిలో అదనంగా 30 పడకలు



గాంధీలో అత్యవసర సమావేశంలో పాల్గొన్న వైద్యులు

అడ్డగుట్ట, మార్చి 20(ఆంధ్రజ్యోతి): గాంధీ ఆస్పత్రిలోని క్యాజువాలిటీ (అత్యవసర) విభాగంలో అదనంగా 30పడుకల మంచాలను ఏర్పాటు చేయనున్నట్టు గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజకుమారి తెలిపారు. గురువారం ఆస్పత్రిలో ముఖ్య విభాగాధిపతులతో సూపరింటెండెంట్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా క్యాజువాలిటీకి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ప్రత్యేకంగా అదనపు మంచాలు (బెడ్లు) ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. వీటిలో 15పడుకల శస్త్ర విభాగం, మరో 15 పడుకల క్యాజువాలిటీలో ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో డిప్యూటీ సూపరింటెండెంట్ సునిల్ కుమార్, వైద్యులు రాజారాం, వాల్యా, భూపేష్ రాథోడ్, తదితరులు పాల్గొన్నారు.

ఎలివేటెడ్ కారిడార్ బాధితులకు న్యాయం చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న స్థానికులు

బోయిన్‌పల్లి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్మిస్తున్న ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టు నిర్మాణంలో నష్టపోతున్న బాధితులకు సముచిత న్యాయం చేయాలని స్థానిక బోయిన్‌పల్లి బాధితులు, సంబంధిత అధికారులను కోరారు. గురువారం అధికారులు 1వ వార్డులోని న్యూ బోయిన్‌పల్లి సంజీవయ్య నగర్‌లోని చిన్నతోకట్ట కమ్యూనిటీహాల్‌లో స్పెషల్ ల్యాండ్ అక్విజేషన్ అధికారి రాజేష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ ముకుంద్‌రెడ్డి, తిరుమలగిరి సర్వేయర్ వెంకటేష్ గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా బాధితులు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అధికారులకు అందజేసి సమస్యలు తెలిపారు. ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంలో భాగంగా బాధితులకు ఎలాంటి నష్టం జరిగినా తాము అండగా ఉంటామని ఆయన పేర్కొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు



సనత్‌నగర్ హనుమాన్ ఆలయ(సెవెన్ టెంపుల్స్) ప్రాంగణంలోని 20 హుండీల ఆదాయాన్ని లెక్కించారు. 50 రోజులకు గాను రూ.3,81,102 ఆదాయం వచ్చింది. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీదేవి, ఈవో సత్యనారాయణ నాయుడు ఆధ్వర్యంలో హుండీ ఆదాయం లెక్కింపు కొనసాగింది. కార్యక్రమంలో అర్చకులు రిప్పంజయశర్మ, విజయేంద్ర, సిబ్బంది కాటం శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

- బేగంపేట, మార్చి 20(ఆంధ్రజ్యోతి)

ఆలయాభివృద్ధికి దాతల సాయం



ఆలయ అభివృద్ధికి సాయం చేసిన దాతలు

అడ్డగుట్ట, మార్చి 20(ఆంధ్రజ్యోతి): తుకారాంగేట్‌లోని 150 ఏళ్ల చరిత్రాత్మకమైన ఆలయం పహాడి హనుమాన్ ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న నిర్మాణ పనులకు దాతలు సాయం చేశారు. మీసేవ యజమాని దేవేందర్, శంకుంతల, రమేష్ ప్రోత్సాహంతో ఆలయ ప్రాంగణంలో స్లాబ్ నిర్మాణానికి సాయం చేశారు. ఆలయంలో జరుగుతున్న నిర్మాణ పనులను ఆలయ ధర్మకర్తలు సందర్శించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మేకల లక్ష్మణ ప్రసాద్, ఆలయ ముఖ్య సలహాదారుడు ఆదం భరత్ కుమార్ ధర్మకర్తలు లలిత్, విష్ణు, విఠల్, సంతోష్, మూర్తి పాల్గొన్నారు.

యాక్షన్ ప్లాన్ సిద్ధం

- కంటోన్మెంట్‌లో నీటి కష్టాలు తలెత్తకుండా చర్యలు
- ట్యాంకర్ల కోసం మధ్యవర్తులను ఆశ్రయించకుండా..
- వెబ్‌సైట్ ద్వారా బుక్ చేసుకోవచ్చు



కంటోన్మెంట్ సీఈఓ మధుకర్ నాయక్, వాటర్ సెక్షన్ సూపరింటెండ్ రాజ్‌కుమార్‌లతో సమ్మర్ యాక్షన్ ప్లాన్‌పై చర్చిస్తున్న నామినేటెడ్ సభ్యురాలు బాణుక నర్మద మల్లికార్జున్



సికింద్రాబాద్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): లీకేజీలను నివారించడం, నీటి సరఫరా వ్యవస్థను మరింత పటిష్ఠం చేయడం, ట్యాంకర్ల సంఖ్యను పెంచడం, నీటి వృథాను అరికట్టడం తదితర చర్యల ద్వారా వేసవిలో మంచినీటి సరఫరా సాఫీగా, సవ్యంగా జరిగేలా చూడాలని సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు యంత్రాంగం నిర్ణయించింది. మెట్రో వాటర్ బోర్డుతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ, సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రజలకు నీటి కష్టాలు రాకుండా ముందుకు సాగాలని సమ్మర్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసింది. తక్షణమే ఈ ప్లాన్‌ను అమలులోకి తీసుకురావాలని సికింద్రాబాద్ కంటోన్మెంట్ నామినేటెడ్ సభ్యురాలు బాణుక నర్మద మల్లికార్జున్, సీఈఓ డి.మధుకర్ నాయక్, వాటర్ సెక్షన్ సూపరింటెండెంట్ రాజ్‌కుమార్ నిర్ణయించారు.

- 8 వార్డులుగా విభజితమై ఉన్న సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో నీటి సరఫరా సొంతంగా కంటోన్మెంట్ బోర్డు నిర్వహిస్తోంది. మెట్రో వాటర్ బోర్డు నుంచి నీటిని కొనుగోలు చేసి, సొంత రిజర్వాయర్లు పంప్‌హౌజ్‌లకు తెప్పించుకొని, కాలనీలు, బస్తీలకు పైప్‌లైన్ వ్యవస్థ ద్వారా సరఫరా చేస్తోంది.
- వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ఉండడానికి నిర్వహణ వ్యవస్థను పటిష్ఠం చేసుకుంది. రిపేర్లు వస్తే తక్షణమే రంగంలోకి దిగేందుకు మరో రెండు బ్యాచ్‌లను రెడీ చేసింది. మోటార్ల రిపేర్, రీ వైండింగ్‌కు అదనపు సిబ్బందిని నియమించారు.
- పాడైన పంప్‌సెట్ల స్థానంలో కొత్తగా 15 పంప్‌సెట్లు సమకూర్చుకుంటోంది.
- కాలనీలు, బస్తీలకు ప్రస్తుతం నీటి సరఫరా చేస్తున్న 6 ట్యాంకర్లకు అదనంగా 5వేల లీటర్ల సామర్థ్యం కలిగిన మరో 4ట్యాంకర్లను సమకూర్చుకోవాలని నిర్ణయించింది. ప్రజల డిమాండ్, అవసరానికి అనుగుణంగా ట్యాంకర్లను తెప్పించుకునేందు కు టెండర్లు ఆహ్వానించనున్నారు. అన్ని ట్యాంకర్లకు జీపీఎస్ డివైస్‌లు ఏర్పాటు చేయడం ద్వారా ఎటువంటి అవకతవకలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోనున్నారు.
- ట్యాంకర్ల బుకింగ్ గురించి ప్రజలకు విస్తృతంగా అవగాహన కలిగించడానికి, ఆన్‌లైన్‌లో బుకింగ్ చేయవలసి ఉన్నందున సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు కార్యాలయంలో ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయనున్నారు. ప్రతి రోజూ ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5.30గంటల వరకు హెల్ప్‌డెస్క్ సిబ్బంది విధులు నిర్వహిస్తూ, ఆన్‌లైన్ బుకింగ్ చేసుకునే పౌరులకు సహకరిస్తారు. పంప్‌హౌజ్‌లు, ఇతర ప్రాంతాల్లో సైతం తగిన బ్యానర్లు ఏర్పాటు చేయనున్నారు.
- బాలంరాయి పంప్‌హౌజ్‌తోపాటు రైల్వే కాలనీ, లోతుకుంట, బోయినపల్లి, గన్‌బజార్‌లోని ట్యాంకర్ ఫిల్లింగ్ పాయింట్లను నిర్వహణపరంగా బలోపేతం చేయనున్నారు.
- ట్యాంకర్ల కోసం మధ్యవర్తులను ఆశ్రయించకుండా, సికింద్రాబాద్ కంటోన్మెంట్ వెబ్‌సైట్ ద్వారా మాత్రమే పౌరులు బుక్ చేసుకోవాలని, పూర్తి వివరాలకు 8333997653, 833997697 నెంబర్లకు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6గంటల మధ్య ఫోన్ చేసి సంప్రదించవచ్చని వాటర్ సెక్షన్ సూపరింటెండెంట్ రాజ్‌కుమార్ సూచించారు.
- ఈ వేసవిలో నీటి ఎద్దడి తీవ్రంగా ఉంటుందని వినిపిస్తున్న నేపథ్యంలో నీటి సరఫరా వ్యవస్థను మరింత సమర్థవంతంగా నడిపించాలని, కాలనీలు, బస్తీల ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా రేయింబవళ్లు పని చేయాలని అధికారులకు బాణుక నర్మద మల్లికార్జున్ విజ్ఞప్తి చేశారు. కంటోన్మెంట్ సీఈఓ మధుకర్ నాయక్, వాటర్ సెక్షన్ సూపరింటెండెంట్ రాజ్‌కుమార్, ఇతర అధికారుతో ఆమె ఈపాటికే విడివిడిగా సమావేశమై, వేసవి సమ్మర్ యాక్షన్ ప్లాన్‌పై చర్చించారు.

రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

రాంగోపాల్‌పేట్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): 42శాతం బీసీ రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణను ఆమోదించిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ ఇన్‌చార్జి డాక్టర్ కోట నీలిమ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 42శాతం బీసీ రిజర్వేషన్లను, ఎస్సీ వర్గీకరణను శాసన సభలో ఆమోదించిన నేపథ్యంలో గురువారం విక్టోరియాగంజ్ చౌరస్తాలో సనత్‌నగర్ నియోజకవర్గ ఏ బ్లాక్ అధ్యక్షుడు త్రికాల మనోజ్ కుమార్ ముదిరాజ్ నేతృత్వంలో టాపాసులు కాల్చి సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి మిఠాయిలు పంచుకున్నారు. కార్యక్రమంలో డివిజన్ బీసీ ప్రధాన కార్యదర్శి రఘు ముదిరాజ్, నాయకులు రాజు గౌడ్, రహీం, సాధిక్, అఖిల్, యాసిన్, ఎల్లేష, ఈశ్వర్, పాండు గౌడ్, జై కృష్ణ పాల్గొన్నారు.

వెనుకబడిన వర్గాల అభ్యున్నతే లక్ష్యం



సనత్‌నగర్‌లో జరిగిన సంబరాల్లో కాంగ్రెస్ ఇన్‌చార్జి కోట నీలిమ

బేగంపేట, మార్చి 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వెనుకబడిన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ ఇన్‌చార్జి డా. కోట నీలిమ అన్నారు. కుల గణనను నిర్వహించడంతో పాటు బీసీ వర్గాలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించడం.. దీనికి చట్ట బద్ధత కల్పిస్తూ ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లు పాస్ చేయడంతో సనత్‌నగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నేతలతో కలిసి కోట నీలిమ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇది కాంగ్రెస్ విజయం కాదని.. తెలంగాణ ప్రజల విజయమన్నారు. కాంగ్రెస్ పార్టీ పేద, మధ్య తరగతి ప్రజల పార్టీ అన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక సెంటర్



బస్తీ బాటలో వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తున్న అడ్డగుట్ట డివిజన్ మాజీ అధ్యక్షుడు రాజుసాగర్

అడ్డగుట్ట, మార్చి 20(ఆంధ్రజ్యోతి): అడ్డగుట్ట డివిజన్‌లో గత ఆదివారం కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ ఇన్‌చార్జి ఆదం సంతోష్ కుమార్ బస్తీబాటలో వచ్చిన ఫిర్యాదులను గురువారం తుకారాంగేట్‌లోని కాంగ్రెస్ నేతలు ఒక్కొక్కటి పరిష్కరించేందుకు ప్రత్యేక సెంటర్‌ను ఏర్పాటు చేశారు. అడ్డగుట్టకు చెందిన 78 ఏళ్ల వృద్ధురాలికి భర్త చనిపోవడంతో వృద్ధురాలికి పెన్షన్ రాలేదు. దీంతో వృద్ధురాలిని మారేడుపల్లి తహసీల్దార్ బీమయ్య గౌడ్ ఆధ్వర్యంలో సమస్యను పరిష్కరించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సెంటర్‌కు వస్తున్నారని గంట రాజు సాగర్ తెలిపారు.

పరీక్ష సమయానికి అరగంట ముందే రావాలి

- ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో డిప్యూటీ డీఈఓ శ్రీధర్ గాజుల



ఈ తరహా...

పదో తరగతి పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానుండడంతో సికింద్రాబాద్ మండల పరిధిలోని పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లు, పరీక్షల నిర్వహణ తదితర అంశాలపై సికింద్రాబాద్ మండల ఉప విద్యాశాఖ అధికారి శ్రీధర్ గాజుల 'ఆంధ్రజ్యోతి'తో పలు విషయాలను వెల్లడించారు.

- రెజిమెంటల్‌బజార్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి)

సికింద్రాబాద్ మండల పరిధిలో పరీక్ష కేంద్రాలు ఎన్ని?

మొత్తం 13 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశాం. 3000 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. రెండు కేంద్రాలు ప్రభుత్వ పాఠశాలలో, మిగతా 11 ప్రైవేట్, ఎయిడెడ్ స్కూల్‌లలో ఉన్నాయి.

పరీక్షల నిర్వహణ విధులు నిర్వహించే వారికి శిక్షణ ఇచ్చారా?

ప్రతి పరీక్ష కేంద్రంలో డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్, చీఫ్ సూపరింటెండెంట్ల పర్యవేక్షణలో పరీక్షలు కొనసాగుతాయి. డీఓ, సీఎస్, ఇన్విజిలేటర్లకు శిక్షణ ఇచ్చాం.

పరీక్ష కేంద్రాల్లో వసతులపై తీసుకున్న చర్యలు?

పరీక్ష కేంద్రాల్లో ఫ్యాన్‌లు, వాటర్, మూత్రశాలలు, వెంటిలేషన్ వసతులను పరిశీలించి ఏర్పాట్లు చేయించాం.

ఎండల వల్ల విద్యార్థులు అస్వస్థతకు గురైతే?

ప్రతి పరీక్ష కేంద్రంలో ఆశా వర్కర్‌ను ఏర్పాటు చేశాం. స్వల్ప అనారోగ్యానికి గురైతే చికిత్స అందిస్తారు. అవసరమైతే ఆస్పత్రికి తరలించే ఏర్పాట్లు చేశాం.

విద్యార్థుల తల్లిదండ్రులకు మీరిచ్చే సూచనలు, సలహాలు?

తల్లిదండ్రులు పిల్లలను పరీక్ష సమయానికంటే అరగంట ముందే తీసుకురావాలి. పిల్లలు ఒత్తిడికి లోను కాకుండా సాధారణంగా స్కూల్‌లో రాసే పరీక్షల మాదిరే ఆలోచించేలా ధైర్యం చెప్పాలి.

ఎన్నికల జాబితా నిర్వహణలో 'ఏఐ'ను ఉపయోగించాలి



సీనియర్ కాంగ్రెస్ నేత విశాల్ సుదాం

బేగంపేట, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఎన్నికల జాబితా నిర్వహణలో కృత్రిమ మేధ 'ఏఐ'ను ఉపయోగించాలని.. అప్పుడే ఓటరు జాబితాలో దొంగ ఓట్ల నివారణ, తప్పులకు అవకాశం లేకుండా ఉండే అవకాశాలున్నాయని సీనియర్ కాంగ్రెస్ నేత విశాల్ సుదాం అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం ప్రపంచం అన్ని రంగాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను అనుసరిస్తోందన్నారు. సాంకేతికంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న భారతదేశంలో 'ఏఐ' టెక్నాలజీని ఉపయోగించడంవల్ల ఎంతో ప్రయోజనముందన్నారు. ఎన్నికల జాబితాలో సమస్యలను పరిష్కరించేదుకు అధికారులు చాల ఇబ్బందులు పడుతున్నారని, వీటిలోని సమస్యలను తొలగించాలంటే 'ఏఐ' టెక్నాలజీయే ఉత్తమ మార్గమన్నారు. 'ఏఐ' టెక్నాలజీని ఉపయోగించడంవల్ల దొంగ ఓట్లను తొలగించడమే కాకుండా ఓటరు లిస్ట్‌లో అడ్రస్ మార్పులు, తప్పులను సవరించే అవకాశాలు ఉన్నాయన్నారు. ద్వంద ఓట్లను తొలగింపునకు 'ఏఐ' టెక్నాలజీ ఉపయోగపడుతుందన్నారు. భారత ప్రభుత్వం రానున్న రోజుల్లో ఎన్నికల్లో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్‌ను ఉపయోగించడం వల్ల మంచి ఫలితాలు సాధించే అవకాశాలు ఉండే అవకాశం ఉందని విశాల్ సుదాం తెలిపారు.

సమస్యలు పరిష్కరించండి



మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన బాణుక నర్మద మల్లికార్జున్

సికింద్రాబాద్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కంటోన్మెంట్ సమస్యలు పరిష్కరించి, అభివృద్ధికి సహకరించాలని హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సికింద్రాబాద్ కంటోన్మెంట్ నామినేటెడ్ సభ్యురాలు బాణుక నర్మద మల్లికార్జున్ విజ్ఞప్తి చేశారు. ఆషా ఆఫీసర్స్ కాలనీ వద్ద రోడ్డు నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమానికి గురువారం విచ్చేసిన పొన్నం ప్రభాకర్‌ను ఆమె కలిశారు.

కంటోన్మెంట్‌కు వాటర్ బోర్డు నుంచి గతంలో 59 లక్షల గ్యాలన్ల నీటి సరఫరా జరిగేదని, ఇటీవల 69లక్షల గ్యాలన్లకు పెంచుతున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని, ఇప్పటి వరకూ అది అమలులోకి రాలేదని ఆమె తెలిపారు. కంటోన్మెంట్‌లో 10పంప్‌హౌజ్‌లు, తగినంత వాటర్ లైన్లు ఉన్నాయని, తద్వారా నీటిని నిల్వ చేసుకునే సదుపాయం, సామర్థ్యం పుష్కలంగా ఉన్నట్టు స్పష్టం చేశారు. తాము ఎక్కువ పరిమాణంలో నీటిని సరఫరా చేద్దామనుకుంటే, కంటోన్మెంట్‌కు నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం లేదంటూ రాష్ట్ర ప్రభుత్వం నుంచి, మెట్రో వాటర్ బోర్డు నుంచి ప్రకటనలు వస్తున్నాయని, ఇది సరికాదని బాణుక నర్మద వెల్లడించారు. కంటోన్మెంట్‌లోని ఆస్తుల రిజిస్ట్రేషన్ ద్వారా వచ్చే ఆదాయం నేరుగా కంటోన్మెంట్ బోర్డు ఖజానాలో జమ చేయాలని, దానిని రాష్ట్ర ప్రభుత్వం తీసుకొని, కంటోన్మెంట్ బోర్డుకు ఇష్టమొచ్చినప్పుడు చెల్లించే విధానానికి చరమగీతం పాడాలని కోరారు. ఈ తరహాలో కంటోన్మెంట్ బోర్డుకు బకాయి పడిన 70 కోట్ల టీపీటీ మొత్తాన్ని తక్షణమే చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. బాణాల శ్రీనివాస్‌రెడ్డి, బి.ఎన్.శ్రీనివాస్, ధనంజయచారి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల విషయమై సమావేశం

సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల విషయమై ఇంజినీరింగ్ విభాగం అధికారులతో కంటోన్మెంట్ నామినేటెడ్ సభ్యురాలు బాణుక నర్మద మల్లికార్జున్ బుధ, గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఇప్పటివరకు వార్డుల వారీగా వర్క్ ఆర్డర్ ఇచ్చిన తర్వాత ప్రారంభం కాని పనుల వివరాలు తెలియజేయాలని కోరారు. కొత్తగా చేపట్టాల్సిన పనులు, ప్యాచ్‌వర్క్స్, మ్యాన్‌హోళ్ల నిర్మాణం తదితర పనులకు సంబంధించిన అంచనాలు రూపొందించి, వచ్చే బోర్డు సమావేశంలోపు తనకు సమర్పించాలని సూచించారు. ఉమాశంకర్, ఫణికుమార్, రాజేశ్వర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

24 నుంచి టీడీసీఏ అండర్-17 క్రికెట్ టోర్నీ



ట్రోఫీని ఆవిష్కరిస్తున్న డీజీపీ జితేందర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఈనెల 24నుంచి తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘం (టీడీసీఏ) అండర్-17 వన్డే టోర్నమెంట్‌ను నిర్వహిస్తోంది. అమెరికా యూత్ క్రికెట్ జట్టుతో టీడీసీఏ రూరల్ వారియర్స్, రైజర్స్, పాంథర్స్ టీమ్‌లు తలపడనున్నాయి. టోర్నీమెంట్‌లో పాల్గొంటున్న జట్ల జెర్సీలను తెలంగాణ డీజీపీ జితేందర్ తన కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. గ్రామీణ తెలంగాణ క్రికెటర్ల అభ్యున్నతి కోసం టీడీసీఏ చేస్తున్న కృషిని జితేందర్ అభినందించారు. టీడీసీఏ అధ్యక్షుడు అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి, అమెరికా యూత్ క్రికెట్ అకాడమీ అధ్యక్షుడు అరుణ్, ఎస్‌జీఎఫ్ చైర్మన్, రామిరెడ్డి, టీడీసీఏ సభ్యులు ఉస్మాన్ అలీ, సయ్యద్ నవాజ్ షా, సుధీర్ రెడ్డి పాల్గొన్నారు.

గర్భాశయ క్యాన్సర్‌పై మహిళలకు అవగాహన



లండన్‌లోని స్లవ్‌లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మహిళలు

హైదరాబాద్ సిటీ, మార్చి 20(ఆంధ్రజ్యోతి): లండన్‌లో ప్రవాస భారతీయులు స్థాపించిన బెర్క్‌షైర్ భారత్ కమ్యూనిటీ (బీబీసీ) చారిటబుల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మహిళల గర్భాశయ క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాన్ని గురువారం లండన్‌లోని స్లవ్‌లో నిర్వహించారు. ఆడవారిలో వచ్చే సెర్వికల్ కాన్సర్‌పై అవగాహన కల్పించామని ఆర్గనైజేషన్ కార్యనిర్వాహక సభ్యురాలు అనిత అవుల తెలిపారు. గర్భాశయ క్యాన్సర్ ఇప్పటికీ ప్రపంచ ఆరోగ్య సమస్యగా ఉంది. ప్రభుత్వాలు, ఆరోగ్య సంరక్షణ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు క్యాన్సర్ నివారణకు కలిసి పనిచేయాలన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు లీలా అంజిరెడ్డి, సుచిత్ర నేములతో పాటు పలువురు మహిళలు పాల్గొన్నారు.

నాలుగో తరం చూస్తున్న శతాధిక వృద్ధుడు

- వందవ పుట్టిన రోజు వేడుక



భార్య సుశీల, కుటుంబ సభ్యులతో వీశంశెట్టి యాదగిరి

రెజిమెంటల్‌బజార్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): తండ్రి వందవ పుట్టిన రోజు వేడుకలు కుమారుడు బంధువుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. సికింద్రాబాద్‌లోని ఓ హోటల్‌లో తనయుడు ప్రేమ్‌సాగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన వందవ పుట్టిన రోజు వేడుకలలో నాలుగో తరం మునిమనవడిని ఆడిస్తూ ఉత్సాహంగా కనిపించాడు. 1925 సంవత్సరంలో బుగ్గయ్య, అనంతలక్ష్మీ దంపతుల సంతానం 8 మందిలో రెండో సంతానం వీశంశెట్టి యాదగిరి జన్మించాడు. మోండా మార్కెట్‌లో నివాసముండే యాదగిరి కుటుంబం హార్డ్‌వేర్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. అయనకు నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. 1925 సంవత్స రం అయన జన్మించగా 2024 మునిమనమడు జన్మించాడు. కుటుంబ సభ్యులు వారు జన్మించిన సంవత్సరాలను ప్లే కార్డులతో ప్రదర్శించారు. తన వందవ పుట్టిన రోజు వేడుకలకు తన స్నేహితులు, బంధువులు రావడం సంతోషం కలిగించిందని, ఇప్పటికి ఆరోగ్యంగా ఉండటానికి కారణం శాకాహారిని అని వీశంశెట్టి యాదగిరి తెలిపారు.

తుకారాంగేట్‌లో యువతి అదృశ్యం



అర్చన

అడ్డగుట్ట, మార్చి 20(ఆంధ్రజ్యోతి): తుకారాంగేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో యువతి అదృశ్యమైంది. ఇన్‌స్పెక్టర్ శంకర్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. తుకారాంగేట్ బోయబస్తీకి చెందిన సురేందర్ కుమార్తె అర్చన (25) ప్రైవేట్‌లో ఉద్యోగం చేస్తోంది. బుధవారం ఉద్యోగానికి వెళ్లిన యువతి రాత్రి వరకు ఇంటికి రాలేదు. వెంటనే కుటుంబ సభ్యులు బంధువులు స్నేహితుల ఇళ్లలో వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

అడ్డగుట్ట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): డబ్బు విషయంలో ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. నిజామాబాద్ గాయిత్రీనగర్‌కు చెందిన దుద్దోళ్ల హేమంత్(25) సికింద్రాబాద్ రెజిమెంటల్‌బజారులోని మ్యాన్ పవర్ కంపెనీలో స్నేహితుడు గోపాల్ బాధ్యతలు అప్పగించాడు. ఈ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు జీతాలు ఇవ్వవాల్సి ఉండగా స్నేహితుడు గోపాల్ రెజిమెంటల్‌బజారులో ఉన్న కార్యాలయానికి వచ్చి హేమంత్‌ను డబ్బు ఇవ్వాలని నిలదీశాడు. ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. జీతాలకు సంబంధించిన రూ. 1.20 లక్షలు కావడంతో జీతాలు అందరికీ పంచాలని, వెంటనే డబ్బు ఇవ్వాలని హేమంత్‌ను ఒత్తిడి తీసుకొచ్చాడు. దాంతో గోపాల్‌తో వచ్చిన తన స్నేహితుడు ఇద్దరు కలిసి ఆగ్రహంతో హేమంత్‌పై దాడి చేశారు. ఈ క్రమంలో హేమంత్ రెజిమెంటల్‌బజారులో ఉన్న కార్యాలయంలోనే ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న గోపాలపురం పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. దాడికి పాల్పడిన వ్యక్తులైన గోపాల్‌తో పాటు స్నేహితుడిపై పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.